క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన మాజీ డైరెక్టర్లు


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో నాని, జాన్‌వెస్లీ

జగ్గంపేట: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఉయ్యూరి నాని, రాష్ట్ర క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కుందా జాన్‌వెస్లీ బుధవారం తాడేపల్లిలోని ఆయన స్వగృహంలో కలిశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అధినేత నిర్దేశించినట్టు వారు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి


మహిళతో మాట్లాడుతున్న ఎంపీపీ

ఏలేశ్వరం: సమాజంలో మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం డ్వాక్రా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. డ్వాక్రా రుణాలతో పాటు, ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలన్నారు. సక్రమంగా చెల్లించి మరిన్ని డ్వాక్రా రుణాలు పొందాలన్నారు.

మూడో రోజు ప్రశాంతం

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో జరుగుతున్న ఏపీఈఏపీ సెట్–2025 పరీక్షలు మూడో రోజైన బుధవారం ప్రశాంతంగా జరిగినట్టు డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మొత్తం 1,065 మంది విద్యార్థులకు గాను 37 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారని చెప్పారు.

విద్యార్థులకు శిక్షణ


ఏలేశ్వరంలో శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

ఏలేశ్వరం: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గ్రంథాలయాల్లో బుధవారం విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. పట్టణంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు మామిడి రాము విద్యార్థులకు చిత్రలేఖనం, కథలు చదవడం, రాయడం, పద్య పఠనం, భావాలు చెప్పడం, చిత్రలేఖనం, నృత్యం తదితర అంశాలపై శిక్షణ నిర్వహించారు. విద్యార్థులకు వివిధ కళలు, చదువు, క్రీడలు, యోగా తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు వాసా పుల్లయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పుంత రోడ్డు పటిష్టంగా నిర్మించాలి


గోతులమయంగా మారిన పుంత రోడ్డు

కిర్లంపూడి: మండలంలోని జగపతినగరం–కొండయ్యపేట పుంత రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు గోతులతో అధ్వానంగా మారింది. మట్టి రోడ్డు కావడంతో చిన్నపాటి వర్షం కురిస్తే గోతుల్లో నీరు చేరి, రోడ్డంతా బురదమయంగా మారుతోంది. తమ పొలాల్లోకి వెళ్లటానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శాశ్వత ప్రాతిపదికన రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

బసవేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు


రాచపల్లిలో బసవేశ్వరుడికి అభిషేకం నిర్వహిస్తున్న పండితుడు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామివారి క్షేత్రంలో బుధవారం బసవేశ్వరునికి 21 ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పండితుల మంత్రోచ్చరణ మధ్య శాస్త్రోక్తంగా పంచామృతాలతో పాటు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు భారీగా తరలి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

మామిడీలా

- ప్రత్తిపాడు మార్కెట్లో సాగుతున్న విక్రయాలు
- తెగుళ్లతో తగ్గిన దిగుబడి
- అనుకూలించని వాతావరణం
- నష్టాలు తప్పవంటున్న రైతులు

ప్రత్తిపాడు: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ప్రత్తిపాడు మార్కెట్లోకి మామిడి వచ్చిందండోయ్.. నోరూరించే మధుర ఫలం ఈ ఏడాది కాస్త ఆలస్యమైంది. ప్రతి ఏడాది ఏప్రిల్‌లో వచ్చే మామిడి ఈసారి కొంత ఆలస్యమైంది. పూర్తి స్థాయిలో బాగా ముదురు కాయలు కావాలంటే ఇంకా వారం రోజులు పడుతుందని రైతులు చెబుతున్నారు. ప్రత్తిపాడు ప్రాంతంలో బంగినపల్లి, కలెక్టర్, రసాలు, కొబ్బరి మామిడి, సువర్ణరేఖ, నీలం, పసంద్ తదితర రకాలు అందుబాటులో ఉన్నాయి. ఈ నెల తొలి వారం నుంచి అమ్మకాలు ప్రారంభం కాగా, ప్రస్తుతం కొంత ఊపందుకున్నాయి.

బైపాస్‌లోనే అమ్మకాలు

నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే 16వ నంబర్ జాతీయ రహదారిలో ప్రత్తిపాడు అటవీ శాఖ చెక్ పోస్టు వద్ద రెండు నెలల పాటు మ్యాంగో మార్కెట్ హైవే మార్కెట్‌గా మారుతుంది. వాహనదారులను ఆకట్టుకునేలా అందంగా దుకాణాలను తీర్చిదిద్ది, మామిడిపండ్లను పేర్చి అమ్మకాలు సాగిస్తారు. ఇక్కడ హోల్‌సేల్‌గా వ్యాపారం సాగుతుంది. పల్లెల్లో సైకిళ్లపై తిరుగుతూ చిల్లరగా అమ్ముకునే వర్తకులు కూడా ఇక్కడే కొనుగోలు చేస్తారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో సుమారు 4,600 ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. ఈ తోటల్లో దిగుబడిని పెద్ద వర్తకులు తోటల్లోనే కొనుగోలు చేస్తారు. ఈ తోటలలో పండినవి ఎక్కువ శాతం ప్రత్తిపాడు మార్కెట్‌కు తరలిస్తారు. కాగా జాతీయ రహదారిపై యర్రవరం, ప్రత్తిపాడు, ధర్మవరం, కత్తిపూడి తదితర ప్రదేశాల్లో మామిడి దుకాణాలున్నాయి. ఎగుమతులతో పాటు ఈ వ్యాపారం కూడా అధికంగా సాగుతోంది. ప్రస్తుతం ప్రత్తిపాడు మార్కెట్లో రకాన్ని బట్టి పరక (13 కాయలు) రూ.100 నుంచి రూ.500 వరకు ధర పలుకుతుంది. ఈ ఏడాది మామిడి పంటకు తెగుళ్లు సోకడంతో దిగుబడి తక్కువగా వచ్చే అవకాశం ఉండడంతో మామిడి ధర అధికంగా ఉన్నాయి.


ప్రత్తిపాడు జాతీయ రహదారిలో ఉన్న మామిడి మార్కెట్

ఈ ఏడాది తప్పని నష్టాలు



మామిడి పంట ఈ ఏడాది నష్టాల్నే మిగిల్చింది. పూత దశలో గాలివానలు పూతను రాల్చేశాయి. పిందె దశలో తెగుళ్లు సోకాయి. మామిడికి పురుగు పట్టింది. పంట చేతికి అందే దశలోనూ ఉపద్రవాలు వచ్చి పడ్డాయి. వాతావరణం అనుకూలించకపోవడం వల్ల దిగుబడులు గణనీయంగా తగ్గాయి. మరోవైపు కోతులు కొంత పంటను నాశనం చేశాయి. క్రిమి సంహారక మందులు, ఎరువుల ధరలు పెరగడం కూడా ఇందుకు కారణం.

– మేరా సింహాచలం, మామిడి రైతు, టి.రాయవరం, ప్రత్తిపాడు మండలం

ఎటపాక 'నవోదయ'కు ఎంపిక


దూది శ్రీసూర్య వెంకట సాయికుమార్

కిర్లంపూడి: సోమవరం జిల్లా ప్రజాపరిషత్ పాఠశాలలో పదో తరగతి చదివిన దూది శ్రీసూర్యవెంకట సాయికుమార్ ఇటీవల ఎటపాక నవోదయ విద్యాలయం 11వ తరగతి ప్రవేశానికి నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణుడై ఎంపీసీలో సీటు సాధించాడు. నవోదయ పరీక్షలు రాసేందుకు ప్రోత్సహించిన హెచ్ఎం తోట కాంతారావుకు, గ్రంథాలయ పునర్వికాస వేదిక జిల్లా కన్వీనర్ ఎస్.కన్నబాబుకు, ఉపాధ్యాయులకు విద్యార్థి తల్లిదండ్రులు దూది లక్ష్మణరావు, మేరీకుమారి కృతజ్ఞతలు తెలిపారు.

హనుమాన్ జయంతికి ప్రత్యేక పూజలు

గండేపల్లి: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గండేపల్లిలో చెరువు గట్టుపై వేంచేసియున్న అభయాంజనేయ స్వామివారి ఆలయం వద్ద గురువారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అభిషేకాలు, సింధూర, కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు ఉంటాయని చెప్పారు.

రుణాల రికవరీపై అలసత్వం వద్దు

డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు

కిర్లంపూడి: వివిధ పథకాల్లో ఇచ్చిన రుణాల రికవరీలపై అలసత్వం వహించవద్దని డీఆర్‌డీఏ పీడీ జి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మహిళా సమాఖ్యలో ఏపీఎం ఎస్.వేదకుమారి అధ్యక్షతన కార్యాలయ సిబ్బందికి, వీఓలకు బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్, ఈఆర్ఎఫ్ పథకాల ద్వారా ఇచ్చిన రుణాలను త్వరితగతిన రికవరీ చేయాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను గుర్తించి, రుణాల మంజూరుకు సహకరించాలని వీఓలకు సూచించారు. కిర్లంపూడిలోని మహిళా మార్టులో సేల్స్ పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఏపీడీ జిలానీ, డీపీఎంలు రాయ్, భరత్, ఏపీఎం అనిల్‌కుమార్, సీసీలు వై.లోవరాజు, ఎన్.బుల్లియ్య, ఎస్.ప్రసాద్, శాంత, వీఓఏలు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ప్రత్తిపాడు: బ్యాంకుల నుంచి పొందిన రుణాలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ జి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం సాయంత్రం గ్రామైఖ్య సంఘాల సభ్యులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ, సూర్యఘర్ పథకంలో మండలంలోని 2 వేల రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేయించాలన్నారు. ఈ అవకాశాన్ని డ్వాక్రా సభ్యులు సద్వినియోగం చేసుకుని, రాయితీలు పొందాలన్నారు. డ్వాక్రా సంఘాలు బ్యాంకు రుణాలతో తప్పనిసరిగా యూనిట్లు నెలకొల్పాలన్నారు. రుణాలను సకాలంలో తిరిగి బ్యాంకులకు చెల్లించాలని ఆదేశించారు. గ్రామాల వారీగా సామాజిక పెట్టుబడి నిధి, స్త్రీనిధి, ఉన్నతి, ఎస్సీ, ఎస్టీ రుణ రికవరీ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఏపీడీ జిలానీ, డీపీఎంలు రాయ్, భరత్, అనిల్, ఏపీఎం వై.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న వీఓ

కష్టపడ్డ కార్యకర్తలందరికీ సముచిత స్థానం

- అక్రమ కేసులకు భయపడొద్దు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా

తుని రూరల్: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కష్టపడ్డ కార్యకర్తలందరికీ సముచిత స్థానం కల్పిస్తామని, అటువంటి వారికే మండల, జిల్లా కమిటీల్లో పదవులు అప్పగిస్తున్నట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. నూతనంగా జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన తుని మండలం కేఓ మల్లవరం గ్రామానికి చెందిన డొంక వెంకట బెనర్జీ తన అనుచరులతో కలసి ఎస్.అన్నవరంలో క్యాంపు కార్యాలయంలో ఉన్న దాడిశెట్టి రాజాను మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ, పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని, క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. నాయకుల చుట్టూ తిరిగితే పదవులు రావని, అంకితభావంతో కష్టపడి పని చేయడం, నమ్మకస్తులుగా మెలగడం, పార్టీ విధివిధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే వారికి పదవులు వరిస్తాయన్నారు. అధికార పక్షం పెత్తనానికి, అక్రమ కేసులకు భయపడొద్దన్నారు. జిల్లా పదవుల్లో ఉన్న నాయకులు క్షేత్ర స్థాయిలో పటిష్ట కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. తనకు అప్పగించిన పదవికి వన్నెతెచ్చేలా పని చేస్తానని, పదవి లభించడంలో సహకరించిన మాజీ మంత్రి దాడిశెట్టి రాజాకు బెనర్జీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు అన్నంరెడ్డి వీర్రాఘవులు, మాజీ సర్పంచ్ ఏకా కన్నయ్య, మాజీ ఎంపీటీసీ సుర్ల బాబ్జి, కార్యకర్తలు పాల్గొన్నారు.


వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజాను సత్కరిస్తున్న బెనర్జీ, నాయకులు

నిర్లక్ష్యంతో నిండు జీవితం కోల్పోరాదు

డీటీసీ శ్రీధర్

గండేపల్లి: వాహనాలు నడిపేటప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించి నిండు జీవితాన్ని కోల్పోవద్దని జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కె.శ్రీధర్ అన్నారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన రహదారి భద్రత–మన జీవన భద్రత కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. ప్రపంచంలోనే అత్యంత యువశక్తి ఉన్న మన దేశంలో అధిక శాతం రోడ్డు ప్రమాదాలు యువత వల్లే సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు భద్రత పాటించని కారణంగా దేశవ్యాప్తంగా ఏటా 1.60 లక్షల మంది ప్రమాదాలకు గురై, ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. రోజుకు 400 మంది మృత్యువాతకు గురవుతున్నారని తెలిపారు. సక్రమంగా డ్రైవింగ్ చేస్తే సరిపోదని, ఎదురుగా సక్రమంగా వస్తున్నారా లేదా గమనిస్తూ వాహనం నడపాలని విశ్లేషించారు. యూనివర్సిటీ డ్రైవర్లకు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. యూనివర్సిటీ చాన్సలర్ ఎన్.శేషారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బీవీ మురళీకృష్ణ, జిల్లా భద్రతా విభాగం వైద్యాధికారి ఏవీ పద్మావతి, యూనివర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.


డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న డీటీసీ శ్రీధర్

భూములు దక్కే వరకు పోరాటం

జగ్గంపేట: మండలంలోని మల్లిసాల అడ్డుకొండ భూములు పేదలకు దక్కే వరకు పోరాటం ఆగదని రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు స్పష్టం చేశారు. అడ్డుకొండ భూముల్లోని మామిడితోటలో కొందరు వ్యక్తులు బుధవారం అక్రమంగా మామిడి కాయలు కోస్తుండగా తమ సంఘం అడ్డుకుందన్నారు. ఈ క్రమంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దారన్నారు. ఈ సంఘటనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మాజీ ప్రధాని రాజీవ్‌కు నివాళులు


రాజీవ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

ప్రత్తిపాడు: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తలు బుధవారం నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ కళామందిర్ వద్దనున్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ, ఆర్థిక పరిపుష్టి, స్వాతంత్ర్య సాధనకు గాంధీ కుటుంబం ఎన్నో త్యాగాలు చేసిందన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ


శ్రీకాంత్‌రెడ్డి

పెద్దాపురం: స్థానిక మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన కేవీ పద్మావతిని సీడీఎంఈకు రిపోర్ట్ చెయ్యాలని ఆదేశాలు అందడంతో ఆమె స్థానంలో శ్రీకాంత్‌రెడ్డి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈయన కాకినాడ కార్పొరేషన్‌లో కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ పురప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానన్నారు. పట్టణ పరిశుభ్రతతో పాటు పట్టణాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. తొలుత మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి ఆధ్వర్యంలో ఆయనకు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు.

ప్రజలను మోసం చేసిన 'కూటమి'

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేసిందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు విమర్శించారు. మండలంలోని శరభవరం, రౌతుపాలెం గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన శరభవరంలో చెందిన మాజీ ఎంపీటీసీ అమరాధి నాగభూషణం, రౌతుపాలెం గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు నేదుళ్ల శ్రీనును పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, నాయకులు గారా రమణ, రామిశెట్టి దొరబాబు, గువేరా, దలే చిట్టిబాబు, గుడాల వెంకటరత్నం, అమరాధి కాశి, రంగనాథం అబ్బాయి, గొల్లపల్లి దొరబాబు తదితరులు ఉన్నారు.


డాక్టర్ చిట్టికొండను పరామర్శిస్తున్న గిరిబాబు

డాక్టర్ చిట్టికొండకు పరామర్శ

ప్రత్తిపాడు: అనారోగ్యానికి గురైన డాక్టర్ అందే చిట్టికొండను బుధవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పరామర్శించారు. ప్రత్తిపాడులోని ఆయన స్వగృహంలో కలిసి, యోగ క్షేమాలను తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, రెడ్నం కోటి, కరెడ్ల ఈశ్వరరావు, ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్లు ఉన్నారు.

త్వరితగతిన పన్నులు చెల్లించాలి

గైర్హాజరైన కార్యదర్శులపై డీఎల్పీఓ ఆగ్రహం

గండేపల్లి: ఆన్‌లైన్ ద్వారా పన్నులు చెల్లించే విధంగా దృష్టి సారించాలని డీఎల్పీఓ బాలామణి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. తాళ్లూరు పంచాయతీ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమావేశం నిర్వహించారు. పన్నుల చెల్లింపు త్వరితగతిన పూర్తిచేయాలని, చెల్లింపు ఆన్‌లైన్ ద్వారా జరగాలని ఆదేశించారు. అందుకనుగుణంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్ హౌస్ ట్యాక్స్ డేటా ఎంట్రీలో భాగంగా ఇంటి యాజమాని వివరాలు నమోదుచేయాలని చెప్పారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం తదితర వాటిపై శ్రద్ధ చూపాలన్నారు. నీలాద్రిరావుపేటలో జరిగిన అనుమతులు లేని పనులపై ఆరా తీసి, చర్యలు తీసుకుంటామన్నారు.

కార్యదర్శుల డుమ్మా

సమావేశానికి పూర్తిస్థాయిలో కార్యదర్శులు హాజరుకాకపోవడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. మండలంలో 18 పంచాయతీలకు కేవలం పది మంది పంచాయతీ కార్యదర్శులు మాత్రమే హాజరయ్యారు. ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఎలా అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా పనితీరు మార్చుకోవాలని సూచించారు. తొలుత మల్లేపల్లి, గండేపల్లిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శులు వీర శిరీష, తరంగిణి, షకీలా, సత్యనారాయణ, బాలు వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.


పంచాయతీ కార్యదర్శులకు సూచనలిస్తున్న డీఎల్పీఓ

వాహనాల పార్కింగ్‌తో ఇక్కట్లు

గండేపల్లి: మండలంలోని హైవేలో రోడ్డు మార్జిన్‌కు దగ్గరగా పార్కింగ్ చేస్తున్న వాహనాల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 18 కి.మీ. మేర జాతీయ రహదారిలో రోడ్డును ఆనుకుని అనేక దుకాణాలున్నాయి. ఆయా దుకాణాల వద్ద ఆగేందుకు డ్రైవర్లు తమ వాహనాలను నిర్లక్ష్యంగా నిలుపుదల చేయడంతో, అదే మార్గంలో వెళుతున్న వాహనాలకు ఇబ్బందికరంగా మారుతుంది. వాహనాలు తప్పించే క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. విశాఖపట్నం, విజయవాడ వైపు వెళ్లే మార్గాలు వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటాయి. ఈ క్రమంలో వెనుక నుంచి వస్తున్న వాహనాల వేగానికి పక్కకు తప్పుకొనే అవకాశం కూడా లేకుండా, ప్రమాదాలకు గురికావాల్సి వస్తోందని ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.


మల్లేపల్లి శివారు హైవే మార్జిన్‌కు దగ్గరగా నిలిపిన వాహనాలు

కొనసాగుతున్న కాంట్రాక్టు కార్మికుల సమ్మె

సామర్లకోట: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కాంట్రాక్టు కార్మికుల సమ్మె బుధవారం కూడా కొనసాగింది. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈనెల 7వ తేదీ నుంచి నల్లబాడ్జీలు ధరించి నిరసనతో సమ్మెలోకి దిగారు. అయినా మున్సిపల్ అధికారులు, పాలకుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్షలు ప్రారంభించిన విషయం తెలిసిందే. యూనియన్ అధ్యక్షుడు ఉండవిల్లి రామరాజు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, 15 ఏళ్ల సీనియారిటీ ఉన్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, విధులలో చనిపోయిన వారికి రూ.10 లక్షలు, అంగవైకల్యం పొందిన వారికి రూ.ఐదు లక్షలు నష్ట పరిహారంతో పాటు, కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఏడాదిలోని ఆదివారాలు, కేంద్ర, రాష్ట్ర పండగలకు 17 రోజులు సెలవులు ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, సీనియార్టీ ప్రాతిపదికలో వేతనాలు చెల్లించాలని, స్కిల్ వర్కర్లకు రూ.29,200, నాన్ స్కిల్ వర్కర్లకు రూ.24,500 వేతనాలు ఇవ్వాలనే డిమాండ్లు ప్రభుత్వం వద్ద ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించకపోతే జూలై 9వ తేదీ నుంచి పారిశుధ్య కార్మికులు కూడా సార్వత్రిక సమ్మెలోనికి దిగుతాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పులపకూర రామకృష్ణ, లంక శ్రీహరి, నక్క రత్నంరాజు తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై యోగా డే


రత్నగిరిపై యోగా చేస్తున్న దేవస్థాన సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల కార్యకర్తలు

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో రత్నగిరిపై యోగా డే సందర్భంగా బుధవారం దేవస్థాన సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల కార్యకర్తలు యోగాసనాలు వేశారు. సత్యదేవుని నిత్య కల్యాణ మండపంలో హుండీ ఆదాయం లెక్కింపు అనంతరం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దేవస్థాన హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు పర్వత వీరేష్ మాట్లాడుతూ, యోగా వలన శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. నిత్యం యోగా చేసే వారికి ఎటువంటి రోగాలు రావన్నారు. ఈ సందర్భంగా పలు యోగాసనాలను నిపుణులు వేసి చూపించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఈఈ వీర్ల సుబ్బారావు, పలువురు దేవస్థాన సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ రక్తదాన శిబిరం

కొత్తపల్లి: స్థానికంగా ఉన్న సురక్ష ప్యాలెస్‌లో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల సహకారంతో, కాకినాడ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని తహసీల్దారు చిన్నారావు, ఎంపీడీవో రవికుమార్‌తో కలిసి డాక్టర్ జ్యోతులు శ్రీనివాస్, జనసేన నాయకులు ప్రారంభించారు. ఈ శిబిరంలో సుమారు 55 మంది రక్తదానం చేసినట్లు రెడ్‌క్రాస్ వైద్యాధికారి దుర్గారాజు తెలిపారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ శిబిరంలో జనసేన పార్టీ నాయకులు మర్రెడ్డి శ్రీనివాస్, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.